


# నేను - నా జ్ఞాపకాలు

## - జీడిగుంట రామచంద్రమూర్తి



*రచనా కాలం: 2019*

*(గత సంచిక తరువాయి)*

## నాకు జ్ఞాపకం లేని "ఆ అరవై రోజులు"

అమ్మ ప్రదర్శించిన ఆత్మస్థైర్యం నాకు కొండంత బలాన్ని ఇచ్చింది.

నా స్మృతి

*(70వ పుట్టిన రోజు) సాహితీ స్వర్ణోత్సవం సందర్భంగా ఫిబ్రవరి 2010లో కిన్నెర ఆర్ట్ థియేటర్స్ మరియు ఢిల్లీ తెలుగు అకాడమీ వెలువరించిన అభినందన సంచికలో ప్రచురించబడిన కొందరు ప్రముఖుల సందేశాలు, నా కుటుంబ సభ్యుల అభిప్రాయాలు*

***నాకు చాలా ఇష్టమైన జీడిగుంట***

జీవితంలో ఎంతోమంది పరిచయం అవుతారు.

అందరూ వెన్నంటిరారు.

అందరూ మనకి ఇష్టం కూడా కారు.

కొంతకాలం ఇష్టమైనవాళ్ళు కొంతకాలానికి అయిష్టులవుతారు. గత పాతిక సంవత్సరాలుగా, పరిచయాన్ని అభివృద్ధి చేసుకుంటూ ఎప్పుడూ ఇష్టపడేలా ప్రవర్తించే సంస్కారం, హుందాతనం, వాక్సంయమనం, అనురాగంగల మిత్రులు, ఆత్మీయులు జీడిగుంట రామచంద్రమూర్తిగారు.

జీడిగుంట ముందు నాకు కథల ద్వారా పరిచయం. ఆ కథల్లోని మానవీయతా, ఆత్మీయతా స్పర్శలు నన్ను మరింత దగ్గరికి చేర్చాయి. ఆదివారం వస్తే అప్పట్లో రేడియోలో కార్మికుల కార్యక్రమం కోసం ఎదురుచూసే వాళ్ళం. అందులో 'బాలయ్య' అనే పాత్ర ఉండేది. ఏకాంబరం ప్రధాన పాత్ర అయినా బాలయ్యకే ప్రాముఖ్యం వుండేది. ఆ తర్వాత, ఆ బాలయ్య జీడిగుంట వారేనని తెలుసుకుని మరింత అభిమానం పెంచుకున్నారు.

జీడిగుంట చాలా కొద్దిమంది రచయితల్లాగా, "కీర్తి తామర" లేనివారు. అల్పసంతోషి కూడా. తన రచన చదివి, (చూసి కాదు) ఓ ఉత్తరం ముక్క రాసినా, ఫోను చేసినా తెగ సంతోషిస్తాడు. అంతేకాదు తన కథల సంపుటిపై మంచి

సమీక్ష వస్తే డాక్టరేట్ వచ్చినంత సంబరపడ్డారట. లాబీయింగులూ, అవార్డులూ.. అంటూ వెంపరలాడే అంగుష్ఠ మాత్రులున్న ఈ కాలంలో 'జీనియస్ జీడిగుంట' ఇలా వుండటం నాకు ఇష్టం.

జీడిగుంట ఇష్టం కావడానికి మరో కారణం కూడా వుంది. 'నా కుడిచెయ్యి బాగున్నంత వరకూ రాస్తూనే వుంటాను' అని అన్నందుకు మరీ ఇష్టం. సామాజిక తపనా, మానవీయ లక్షణం, సాహితీ పిపాసా ఉన్న అసలైన రచయిత అలానే అంటాడు - అనాలి. రాసిన దాంతో ఎప్పుడూ సంతృప్తి చెంది ఫుల్‌స్టాప్ పెట్టకూడదు. అందరికీ రచనా సామర్థ్యం ఉండదు. ఉన్నవారు కడవరకూ కొనసాగించాలి. ఈ లక్షణం ఉన్నందుకు 'జీడిగుంట' అంటే బాగా ఇష్టం.

ఉన్నఊరూ, కన్నతల్లీ 'సమానమన్నాడు శ్రీనాథుడు. అలాగే తాను పనిచేసిన సంస్థనూ అమ్మలాగే ఆదరించాలి. మనం శాశ్వతం కాదు గానీ సంస్థలు శాశ్వతం. వాటి బాగు కోసం మనం కృషి చేయాలి. జీడిగుంటలో ఈ విశిష్ట లక్షణం వుంది. రచయితగా నా ఎదుగుదలకు "ఆకాశవాణి" ఎంతో తోడ్పడిందని సగర్వంగా చెప్పుకుంటున్నాను. మరో అమ్మగా ఆ సంస్థకు నమస్కరిస్తుంటాను అనే, "జీడిగుంట" అంటే ఎంతో ఇష్టం.

ఎవరైతే ఆత్మపరిశోధన చేసుకుంటారో వారు సంస్కారి. నేనేమి చేశాను? నేనేమి రాశాను? బాగున్నవి రాశానా? ఏం సాధించాను? ఏం సాధించాలి? అనే పరిశీలనతో, తనను తాను వివేచించుకున్నాడే ఉత్తమ రచయిత. ఇటువంటి వివేచన గల రచయితలు దాదాపు కనుమరుగైపోతున్న దశలో జీడిగుంట కనిపించారు. ఎప్పటికప్పుడు తనను తాను బేరీజు వేసుకుంటూ స్వస్వరూప జ్ఞానం గల తత్త్వం వుంది కాబట్టి నాకు ఇంకా ఇష్టం. అంటే కొమ్ములు రాని రచయితగా ఇష్టం అన్నమాట.

మనిషికి కొంత పేరూ, మరికొంత పదవీ, ఇంకొంత ప్రాచుర్యం రాగానే 'ఈగో' ఆవహిస్తుంది. 'ఎదుటివారి కన్న ఎక్కువ' అనే ఆధిక్యతాభావం అలవడుతుంది. సాహితీ రంగంలో ఇది ఎక్కువని నా అనుభవం. కానీ 'జీడిగుంట' ఎన్ని కథలూ, నాటికలూ, నాటకాలూ, సినీ సంభాషణలూ, స్కెచ్‌లూ, స్కిట్స్, ముచ్చట్లూ ఎంత విస్తృతంగా రాసినా, మీడియాలో పేరుపొందినా మా వంటి ఆత్మీయుల మధ్య ఆ ఛాయలూ, ఆ ఫోజులూ కనిపించనే కనిపించవు. అందుకే 'జీడిగుంట' అంటే నాకు మహా ఇష్టం.

*డా.ద్వానా శాస్త్రి.*

***నిరాడంబరతకు నిలువెత్తు రూపం జీడిగుంట రామచంద్రమూర్తి***

రామచంద్రమూర్తిగారిని నేను దాదాపు ముప్పయి ఏళ్ళుగా ఎరుగుదును. దాదాపు ఆయన సాహితీ ప్రస్థానం అంతా నాకు తెలుసు.

మేమిద్దరం ఎన్నోసార్లు, ఎన్నో కథల పత్రికల్లో కలిసి కొలువు తీరాము. అప్పటినుంచీ వారి కథలు నేను చదువుతూనే ఉన్నాను. ఆనందం అనుభవిస్తూనే ఉన్నాను. 1990లో నేను మద్రాసు నుంచి హైదరాబాద్ చేరుకున్న తర్వాత మా వ్యక్తిగత స్నేహం పురివిప్పుకుంది.

కొందరు ఎదురయితే మనం ఒక తుఫానుతో తలపడ్డట్టే. ఆత్మస్తుతీ, పరనిందా కొన్ని ఉరుములూ కొన్ని మెరుపులూ మనల్ని పలకరిస్తాయి. ఆ జడివానలో మనల్ని అల్లకల్లోలం చేసి వారు వెళతారు. ఒక్కమాటలో చెప్పాలంటే వాళ్ళ పలకరింపులు. ముళ్ళకంపని ముద్దెట్టుకున్నట్టు ఉంటాయి.

ఇంకొందరు ఎదురయితే నడివేసవిలో ఒక పిల్లతెమ్మెర మనల్ని పలకరించిపోయినట్టు హాయిగా మనసుకు ఉల్లాసంగా ఉంటుంది. ఆ పలకరింపు, పులకరింపు మనల్ని కొంతసేపు మధురభావనలో తేలియాడిస్తుంది. ఇది కూడా ఒక్కమాటలో చెప్పాలంటే మల్లెపూవును ఆఘ్రాణించినట్టు ఉంటుంది.

ఈ రెండో కోవకు చెందిన వ్యక్తి రామచంద్రమూర్తిగారు. ఆయన ఎదురయిన ప్రతిసారీ ఒక మల్లెపూల గుబాళింపు వారి మాటల్లో కనబడుతుంది. మనసుకు ఆ కలయిక ఆహ్లాదంగా ఉంటుంది.

ఆ దశరథరాముని పేరు పెట్టుకోవటం వల్ల కాబోలు. రామచంద్రమూర్తిగారికి ఆయన సుగుణాలే అలవడ్డాయి. ఆయన ఎవ్వర్నీ నొప్పించరు. సున్నితంగానే ఏ విషయాన్నైనా చెబుతారు.

తన కథలతోటీ, వ్యక్తిత్వం తోటీ మనుషుల్ని ఎవరినైనా తనపట్ల ప్రేమాస్పదులుగా చేసుకోవటం ఆయనకు తెలుసు. అది వారి దగ్గర నేర్చుకోవలసిన విద్య.

ఇక రామచంద్రమూర్తిగారి రచనా వ్యాసంగం విషయానికి వస్తే ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి. కథలు రాశారు. రేడియో నాటకాల్లో తనదైన ముద్రవేసుకున్నారు. రంగస్థల నాటకాలు రాసి ఖ్యాతి గడించారు. టీ.వీ రంగంలో కొంత సందడి చేశారు. సినిమా కథలు కూడా రెండు మూడు రాశారు. అయితే ఆయనలోని కథకుడంటే నాకు ఎక్కువ ఇష్టం. ఆయన కథల్లో సమాజాన్ని బాగు చేసెయ్యాలనే పట్టుదలా, ఆవేశం కంటే మానవత్వపు పరిమళాల గుబాళింపు నన్ను ఎక్కువ ఆకట్టుకుంటుంది.

జీవిత విలువలూ సెంటిమెంట్లూ, రామచంద్రమూర్తిగారు కథల్లో పడుగు పేకల్లా అల్లుకుని ఉంటాయి. రామచంద్రమూర్తిగారు నెమ్మదస్తుడు, మంచివాడు, కావటంవల్ల ఆయన కథలూ ఆయన పాత్రలూ కూడా 'అయోమయపు పులుముడు' లేకుండా స్పష్టంగా ఉంటాయి.

నిరాడంబరతకు నిలువెత్తుమూర్తి రామచంద్రమూర్తి. అదే నిరాడంబరతా, వినమ్రతా ఆయన కథల్లోనూ కనిపిస్తుంటుంది. అదే వారి శైలి. 'శ్రీరాములు నీవే కలవు' అని రాసిన ఒక 'యాభై నోటు' గురించి ఆయన కథ రాశారు. ఆ కథ నాకు చాలా ఇష్టం. ఆ కథ చదివిన ప్రతిసారీ నా కళ్ళు చెమ్మగిల్లుతాయి.

ఆయన కథలకు ఆర్ద్రత వెన్నెముక. ఆయన రాసిన కథ చదవటం పూర్తి చేసిన తర్వాత ఒక అనుభూతితో, మన కంఠం ముడిపడుతుంది, కంఠం గాద్గదికమవుతుంది. ఆ కథ చదివి ముగించిన తర్వాత కూడా 'జీడి' అంటుకున్న బట్టలాగా జీడిగుంటవారు మన మనస్సును పట్టుకునే ఉంటారు. ఒక రచనకుగానీ, రచయితకుగానీ అంతకంటే కోరదగినది ఏమీలేదు.

**ఆకెళ్ళ.**

***మంచి మనసు + మంచి రచన = జీడిగుంట రామచంద్రమూర్తి.***

కాలానికీ, వయసుకీ అతీతంగా మంచి మనసుకీ, మంచి రచనకీ దూరం కాని మనిషి జీడిగుంట రామచంద్రమూర్తి. నాకు తెలిసీ గత 30 సంవత్సరాల పరిచయంలో ఆయనలో ఏ మార్పూ రాలేదు. ఒక్క వయసు పెరగటం తప్ప. ఈ రోజున ఆయన ఏదైనా సాధిస్తే, సంపాదిస్తే అది ఆయన స్వార్జితం. ఆయన కష్టార్జితం 'డబ్బు' కాకపోవచ్చు. మంచిపేరు.

ముగ్గురు పిల్లల్నీ ప్రయోజకులుగా తీర్చిదిద్దుకున్నారు. ఈ మాటే ఆయనతో అంటే 'నేను చేసిందేమీ లేదు. వాళ్ళే ప్రయోజకులయ్యారు. ఆపై భగవంతుని కృప' అంటారు.

రామచంద్రమూర్తిగారిది మంచి అక్షరం. మంచి రచన. మంచితనం వెరసి అన్నీ మంచివే. ఆయన రచనలు నన్ను చాలా ప్రభావితం చేశాయి. ముఖ్యంగా అలనాడు ఆంధ్రపత్రికలో వచ్చిన సీరియల్ నవల "అనుభూతి అనుబంధం" మరువలేని రచన. అందులో 'భానుమూర్తి' పాత్ర ఈనాటికీ నా కళ్ళకు కడుతూనే ఉంటుంది. ఆయన చక్కని 'ప్రోజ్' రాస్తారు. హాయిగా చదివిస్తుంది. తమ రచనల ద్వారా 'మానవ సంబంధాలను పెంపొందించటం' ఆయనకెంతో ఇష్టం. ఆకాశవాణి నాటక విభాగం ప్రయోక్తగా వున్నప్పుడు నా బోటి ఎంతోమంది చేత మంచి నాటికలు రాయించి చక్కని శ్రవ్య కావ్యాలుగా రూపొందించారు.

శ్రీ జీడిగుంటగారు ఎన్నో కథా సంపుటాల్ని ప్రచురించుకున్నారు. అందులో 'గోదానం' కూడా ఒకటి. 1992లో వచ్చిన ఈ కథా సంపుటం ఇప్పటికీ నా దగ్గర వుంది. ఈ సంపుటానికి 'విశ్వసాహితి' పురస్కారం కూడా వచ్చింది. ముఖ్యంగా వృద్ధాప్యంలో వుంటూ, పిల్లల వివక్షకు గురవుతున్న తల్లిదండ్రుల అంతరంగాల్లోని ఆవేదనా తరంగాలకు అద్దం పట్టే కథ 'గోదానం' కడుపున పడ్డది మొదలు ఎంతో కష్టపడుతూ పిల్లలకు రక్తం పంచి, పెంచి, పోషించి పెద్ద చేసిన తర్వాత రెక్కలొచ్చి ఎగిరిపోయే ఆ 'పిల్ల పక్షులు' ఆ తర్వాత, తమ తల్లిదండ్రుల పట్ల 'కృతఘ్నులు' కావటాన్ని చదువుతుంటే వర్తమాన సమాజంలో ఇది తీవ్రమైన సమస్యగానే మనకు తోస్తుంది. ఈనాటి రచయితలు కొందరు ఈ సమస్యను తమ కథల్లో స్పృశించటం లేదేమో అని కూడా అనిపిస్తుంది.

ఇందులోని 'పక్కలో ముల్లు' కథ అద్భుతం. ఇందులోని అమలిన శృంగారం హృదయానికి అందంగా తాకుతుంది. 'దయమంతి చాలా అందంగా వుంటుంది? మంచు తెరలమాటున కనిపించే సెలయేరుకంటే, వెన్నెల కాంతిలో ఉవ్వెత్తున ఎగిసిపడే సముద్ర కెరటం కంటే, మండు వేసవికి మంగళహారతి పడుతూ కురిసే తొలకరి వర్షం కంటే వెయ్యిరెట్లు బాగుంటుంది' అని ఊరిస్తారు రచయిత. ఈ కథ చదివిన తర్వాత రచయిత ఓ గొప్ప రసజ్ఞునిగా అలంకారికునిగా కనిపిస్తాడు.

తెలుగు కథా సాహిత్యంలోని అందాన్నీ, ఆనందాన్నీ, విషాదాన్నీ అలాగే తెలుగువారి జీవిత ప్రాంగణంలో రాగద్వేషాల్నీ మధుర భావనల్నీ కూడా ఈ 'గోదానం' కథల్లో నిక్షిప్తం అనిపిస్తుంది.

**డా.జె.చెన్నయ్య.**

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

COMMENTS